క్లుప్తంగా

బాలిక అదృశ్యంపై కలకలం

• వసతిగృహంలోనే ఉన్న విద్యార్థిని

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): గురుకులంలోని తరగతి గదిలో బాలిక కనిపించకపోవడంతో కలకలం రేగింది. ఆందోళనకు లోనైన గురుకులం ప్రిన్సిపల్ హడావుడిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆ బాలిక వసతి గృహంలోనే ఉండడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటన మండలంలోని రామచంద్రాపురం గురుకుల పాఠశాలలో బుధవారం చోటుచేసుకొంది. ఇక్కడి గురుకులంలో ఇంటర్ చదివే బాలిక తండ్రిని చూడాలని కబురు పంపారు. కానీ తండ్రికి తీరక లేకపోవడంతో సోమవారం కూడా గురుకులానికి రాలేకపోయారు. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలిక బుధవారం గురుకులంలోని తరగతి గదికి వెళ్లలేదు. దీంతో బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు లోనైన ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ వసుధకు సమాచారం అందించారు. ఆమె హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. తరువాత తీరిగ్గా గురుకులంలోని బాలికల వసతి గదుల్లో పరిశీలించగా మనస్తాపానికి లోనై అక్కడే ఉండిపోయినట్లు గుర్తించారు. దీంతో రెండు గంటలపాటు సాగిన ఉత్కంఠకు తెరపడింది.

పరీక్ష కేంద్రంలో వీసీ తనిఖీ



వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో పరీక్ష కేంద్రాన్ని వీసీ అల్లం శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. వీఎస్‌యూలోని పరీక్ష కేంద్రంలో పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో వీసీ పరీక్షా కేంద్రానికి వెళ్లి విద్యార్థుల హాల్ టికెట్‌లను పరిశీలించి, వసతుల గురించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ విజయకు సూచించారు.

సౌత్ జోన్ పోటీలకు 'అక్షర' విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో అక్షర విద్యాలయ డైరెక్టర్, కోచ్

వెంకటాచలం: తమిళనాడు రాష్ట్రం కారైకుడిలోని చెట్టినాడు పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు వెంకటాచలం మండలం సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఎంపికైన నిశాంత్, ప్రదీప్, ఈషిత్ నాయన్, అబ్దుల్ కలామ్‌లను అక్షర విద్యాలయ డైరెక్టర్ కుముద, కోచ్ సుమన్ బుధవారం పాఠశాలలో అభినందించారు. సౌత్ జోన్ చెస్ పోటీల్లో ప్రతిభ చూపి ఉదయ్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

డెంగీపై అప్రమత్తత అవసరం



డ్రమ్ముల్లో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: డెంగీపై ప్రతిఒక్కరికీ అప్రమత్తత అవసరమని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు సూచించారు. మండలంలోని రామన్నపాళెం పాతూరులో ఇంటింటికీ వెళ్లి దోమల ఆవాసాలను తొలగించి డెంగీపై బుధవారం అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో మంచి నీరు, వర్షపు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. తొట్టెలలో నీరు నిల్వ ఉంటే డెంగీకి కారణమైన ఎడిస్ దోమ ఉత్పత్తవుతుందన్నారు. డెంగీ ప్రాణాంతక వ్యాధి అయినందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా ఇంటి పరిసరాల్లో మురికి నీటి నిల్వలు, చెత్తా చెదారాలు రోజుల తరబడి పేరుకుపోయి ఉంటే మలేరియా, డయేరియా లాంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ మాబ్జానీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలను చెల్లించాలి

నెల్లూరు(అర్బన్): గత రబీ సీజన్లో ధాన్యం కొనుగోలు సందర్భంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో జేసీ కార్తీక్‌తో బుధవారం ఆమె భేటీ అయ్యారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రూ.8.36 కోట్ల కమీషన్ చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని ఆమె వివరించారు.

ఔషధ చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి



హాజరైన కెమిస్ట్‌లు

నెల్లూరు(అర్బన్): ఔషధ చట్టాలపై జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ మెడికల్ షాపుల వారు అవగాహన పెంచుకొని, దానికనుగుణంగా దుకాణాలను నిర్వహించాలని జిల్లా డ్రగ్ కంట్రోలర్ ఏడీ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ కార్యాలయంలో ఆత్మీయ అవగాహన సదస్సును కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ జిల్లా అసోసియేషన్, హోల్‌సేల్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎన్నారెక్స్, హయ్యర్ యాంటిబయోటిక్స్, నొప్పుల మందులు తదితరాలను డాక్టర్ సలహా లేకుండా ప్రజలు వినియోగించరాదని చెప్పారు. అనవసరంగా వినియోగించినా, అదనపు డోసును ఉపయోగించినా శరీరంలోని ఇతర అవయవాలు ప్రభావానికి గురై దుష్ఫలితాలొస్తాయని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. నెల్లూరు, కావలి డివిజన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కీర్తిపవిత్ర, వెంకటకృష్ణ, సంతపేట సీఐ దశరథరామయ్య, కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేరూరి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకర ధ్యాన మందిరంలో పూజలు



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆషాఢ మాస శివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. సామూహిక మహన్యాసపూర్వక ఏకాదశ పూర్ణ, రుద్రవారాభిషేకాలు, అర్చనలు, శంకరభగవత్పాదులకు పుష్పార్చనలను అర్చకుడు పవని అనిల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. చక్రాల వారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆనంద్‌కుమార్, మందిర కమిటీ నూతన అధ్యక్షుడు గుండాపంతుల రామసుబ్రహ్మణ్యశర్మ, ఉపాధ్యక్షురాలు ప్రత్యూషశర్మ, సభ్యులు శ్రీహరిప్రసాద్‌రావు, ప్రభాకర్‌రావు, వెంకటశ్రీకాంత్‌శర్మ, ట్రస్ట్ కార్యదర్శి ఉదయ్‌కుమార్ శర్మ, మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్‌ను కలెక్టర్ ఆనంద్ బుధవారం ప్రారంభించారు. బాలాజీ మొబైల్స్ అధినేత బాలాజీచౌదరి అందజేసిన రూ.ఏడు లక్షలతో దీన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కందుకూరి షాపింగ్ మాల్ సౌజన్యంతో సమకూర్చిన చీరలను బస్టాండ్‌లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులకు ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. నిఖిలేష్, సాయినితేష్, ప్రజా రవాణాధికారి షమీమ్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రమేష్, డిపో మేనేజర్లు మురళీకృష్ణ, దివ్య కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

27న పురస్కారాల ప్రదానం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): శాస్త్రీయ, జానపద నృత్యోత్సవం, హరివిల్లు ప్రతిభ పురస్కారాలను నగరంలోని పురమందిరంలో ఆదివారం అందజేయనున్నామని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపకుడు దోర్నాల హరిబాబు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని కళాసంఘాల చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. అమీర్‌జాన్, లక్ష్మీకాంత్‌బాబు, దోర్నాల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి అభినందనలు





నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పలువురు అభినందనలను బుధవారం తెలియజేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ వేలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ చంద్రశేఖర్‌రెడ్డికి 42వ కార్పొరేటర్ కరిముల్లా ఆధ్వర్యంలో పలువురు ముస్లిం మైనార్టీ నేతలు అభినందనలు తెలిపారు. పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మున్వర్, జహీర్, నేతలు అలీమ్, సందానీ, రమీజా తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ డ్రాఫ్టింగ్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ప్రతినిధి



హాజరైన ఎల్టీపీలు

నెల్లూరు(బారకాసు): భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను మంజూరు చేసేందుకు నూతనంగా రూపొందించిన సివిట్ స్మార్ట్ డ్రాఫ్టింగ్ ఎంతో ఉపయోగపడనుందని సాఫ్టెక్ ఇంజినీర్స్ కంపెనీకి చెందిన శిక్షకులు పేర్కొన్నారు. నెల్లూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎల్టీపీలకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని భాష్యం – వివేకానంద స్కూల్ సెమినార్ హాల్లో బుధవారం నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ సంచాలకులు విద్యుల్లత, రీజినల్ డైరెక్టర్ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్‌ఓ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్‌గా కనకాద్రిని నియమిస్తూ ఉత్తర్వులను రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసింది. డిప్యుటేషన్‌పై ఏడాది పాటు ఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తించిన చైతన్య తన మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో నగరపాలక సంస్థ కార్యాలయంలోని హెల్త్ విభాగంలో బాధ్యతలను బుధవారం ఆయన స్వీకరించారు. నగరంలో పారిశుధ్య మెరుగునకు అత్యంత ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

స.హ.చట్టంపై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమాచార హక్కు చట్టంపై నెల్లూరు సహకార శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా సహకార శాఖాధికారి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై డీసీఓ గుర్రప్ప అవగాహన కల్పించారు. సహకార శాఖ ఆడిట్ అధికారి తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ బాటిళ్ల పంపిణీ



నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టీల్ బాటిళ్లను ఎస్బీఐ విశ్రాంత మేనేజర్ సుబ్బారావు బుధవారం అందజేశారు. భవిష్యత్తులోనూ సాయం చేస్తామని చెప్పారు. హెడ్‌మాస్టర్ కోలా కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు జయలక్ష్మి, దీప్తి, గీత తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ నుంచి నెల్లూరుకు ఆర్టీసీ బస్సు



పెనుబల్లిలో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ నుంచి పెనుబల్లి మీదుగా నెల్లూరుకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. దీనిని పెనుబల్లి గ్రామంలో ఆత్మకూరు డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెనుబల్లి ఎంపీటీసీ సభ్యుడు వినయ్ నారాయణ మాట్లాడుతూ ఈ బస్సు వల్ల సాల్మన్‌పురం, కాగులపాడు, జొన్నవాడ, బాపనపాడు, కొండ్లపూడిల నుంచి పెనుబల్లి ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. అదేవిధంగా జొన్నవాడ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, నెల్లూరుకు నిత్యం వెళ్లే చిరుద్యోగులకు ఉపయోగకరమన్నారు.
కార్యక్రమంలో హెచ్ఎం అనంతకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ గోపి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణకు కృషి



అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నెల్లూరు(అర్బన్): కీటక జనిత, సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు సూచించారు. డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకొని డెంగీ, మలేరియా, ఫైలేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పిస్తూ.. వాటి నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై ర్యాలీని వేదాయపాళెం పట్టణ ఆరోగ్య పరిధిలోని సప్తగిరి కాలనీలో బుధవారం నిర్వహించారు. నీటి తొట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లార్వా సర్వేను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. దోమల నివారణకు మలాథియాన్‌ను స్ప్రే చేయాలని కోరారు. డెంగీ, చికున్‌గున్యా తదితర కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని పేర్కొన్నారు. వైద్యాధికారి నవీన్‌కుమార్, సిబ్బంది శ్యామ్‌సన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పీ4లో భాగస్వాములవ్వాలి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నందన్ తదితరులు

నెల్లూరు(బారకాసు): పీ4లో సంపన్న కుటుంబాలకు చెందిన వారు భాగస్వాములు కావాలని కమిషనర్ నందన్ కాంక్షించారు. పీ4 అమల్లో భాగంగా నగరంలోని వివిధ ఎన్జీఓల నిర్వాహకులతో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. బ్రోచర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలోని వారు మార్గదర్శకులుగా ముందుకొచ్చి బంగారు కుటుంబాల భవిష్యత్తును తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. డిప్యూటీ డైరెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

➡ నగరంలోని కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులకు అడ్డంకిగా ఎలాంటి శాశ్వత నిర్మాణాలను చేపట్టొద్దని కమిషనర్ నందన్ ఆదేశించారు. ఎనిమిదో డివిజన్లోని ఆరెస్సార్ మున్సిపల్ పాఠశాల తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడారు. పాఠశాల ప్రహరీ చుట్టూ ఉన్న కాలువలో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను నిరంతరం చేపట్టాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రహరీ చుట్టూ ఉన్న కాలువలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్లో వసతులను మెరుగుపర్చాలి



సమస్యలు ఆరాతీస్తున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): శెట్టిగుంట రోడ్డులోని చేపల మార్కెట్లో వసతులను మెరుగుపర్చాలని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. ఆరో డివిజన్లోని శెట్టిగుంట రోడ్డులో కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మతో కలిసి బుధవారం పర్యటించిన మేయర్ మాట్లాడారు. మార్కెట్లో తాగునీటి వసతి తదితరాలను మెరుగుపర్చాలని సూచించారు. ర్యాంపు, గేట్ తదితరాల ఏర్పాటుకు సంబంధించిన అంచనాలను అధికారులు రూపొందించారని, పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని కోరారు. అనంతరం మౌలాసాహెబ్ వీధిలో పర్యటించి పారిశుధ్య పనులు తదితరాలను పరిశీలించారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని వినతి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): ఇరవై ఏళ్లుగా హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని తెలంగాణ హైకోర్టు ఆదేశాలంటూ ఇటీవల తొలగించారని, వీరిని విధుల్లోకి తీసుకోవాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. తొలగించిన పలువురు హెల్త్ అసిస్టెంట్లతో కలిసి సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ సుజాతకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఉద్యోగాలు కోల్పోయిన వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. వైద్యశాఖలో పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబీకులకు కారుణ్య నియామకాలను త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలన్నారు. హంస జిల్లా కోశాధికారి శేషగిరిరావు, ఉపాధ్యక్షులు మజహర్, మురళి, నాగరాజు, గౌస్‌బాషా, నేతలు లక్ష్మీకాంతమ్మ, మంజరి, సంజీవ్‌కుమార్, చాముండేశ్వరి, ఉమామహేశ్వరరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కరేడులో భూసేకరణను నిలిపేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కరేడులో భూసేకరణను వెంటనే నిలిపేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి వెంగయ్య డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. పరిశ్రమలు, అభివృద్ధి పేరుతో కరేడులో రైతులకు చెందిన 8500 ఎకరాలను సేకరించేందుకు జీఓను జారీ చేయడాన్ని వెంటనే విరమించాలని డిమాండ్ చేశారు. భూములను అప్పగించేందుకు సిద్ధంగా లేమంటూ గ్రామ సభల్లో రైతులు తీర్మానించిన అంశాన్ని గుర్తు చేశారు. అయితే వీటిని ప్రభుత్వం తుంగలో తొక్కి.. 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించి ఇండోసోల్ సోలార్ కంపెనీకి ధారాదత్తం చేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. రైతు సంఘం పూర్తి మద్దతివ్వనుందని, ఎలాంటి ఉద్యమాలు చేసేందుకైనా సిద్ధమని స్పష్టం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానివి కక్షపూరిత రాజకీయాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పరిపాలన, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికొదిలి.. కక్షపూరిత రాజకీయాలను అవలంబిస్తోందని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జయకుమార్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. మద్యం పాలసీ అంటూ అమలు చేస్తున్న కుట్రలో భాగంగా ఒక ఎంపీపై కేసు పెట్టి వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్, నెల్లూరు రూరల్ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి పాల్గొన్నారు